ఢిల్లీ పేలుడు ఎఫెక్ట్!

రాష్ట్రంలో రెండో రోజూ హై అలర్ట్

● లాడ్జీల్లో తనిఖీలు ● రైల్వేస్టేషన్ల వద్ద తీవ్ర నిఘా



ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీలు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సంభవించిన పేలుడు ప్రకంపనలు రాష్ట్రంలో ప్రతిబింబిస్తున్నాయి. రెండోరోజైన మంగళవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. సోమవారం రాత్రి నుంచే రాష్ట్రంలోని విమానాశ్రయాలు, ప్రధాన రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లలో నిఘా పెంచిన విషయం తెలిసిందే. అదేవిధంగా రాత్రంతా పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. అంతేగాక బైకులు, కార్లు తదితర వాహనాలను తనిఖీ చేశారు. నగరంలోని సుమారు 500 లాడ్జిల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు జరిపారు. కొత్త వ్యక్తులెవరైనా లాడ్జీల్లో ఉన్నారా అని ఆరా తీశారు. సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూరు రైల్వే స్టేషన్, బీచ్ రైల్వేస్టేషన్, తాంబరం రైల్వే స్టేషన్, పెరంబూరు, ఆవడి రైల్వే స్టేషన్ల వద్ద పోలీసులు ప్రయాణికుల లగేజీని మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు. మెట్రోరైల్వే స్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలన్నింటిని మెటల్ డిటెక్టర్లతో తనిఖీ జరిపారు. నగరంలోని షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల వద్ద పోలీసులు మఫ్టీలో నిఘా వేశారు. నగరంలోని ట్రిప్లికేన్, కోయంబేడు, పెరియమేడు ప్రాంతాల్లో ఉన్న సుమారు 500 లాడ్జీల్లో తనిఖీలు జరిగాయి. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం ద్వారా ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ఈ గస్తీ కొనసాగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.



సెంట్రల్ స్టేషన్‌లో ప్రయాణీకుల లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

'సర్'కు వ్యతిరేకంగా

డీఎంకే మిత్రపక్షాల ధర్నా



చెన్నై మింట్ వద్ద 'సర్'కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎండీఎంకే నేత వైగో, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి షణ్ముగం, మేయర్ ఆర్.ప్రియ



తూత్తుకుడిలో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఎంపీ కనిమొళి, డీఎంకే మిత్రపక్షాల నేతలు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 4న ప్రారంభించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు నిరసనగా మంగళవారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే, దాని మిత్రపక్షాలు 43 ప్రాంతాల్లో ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. నగరంలో సైదాపేట, చేపాక్ సహా నాలుగు ప్రాంతాల్లో భారీ ధర్నా చేశాయి. రాష్ట్రంలో వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల ముందు ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టడాన్ని డీఎంకే, దాని మిత్రపక్షాలు ఖండించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని సెక్యూలర్ కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 11న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ధర్నాలు ప్రారంభమయ్యాయి. ఈ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో కాంగ్రెస్, డీపీఐ, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, తమిళగ వాళ్వురిమై కట్చి, మక్కల్ నీదిమయ్యం, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి తదితర డీఎంకే మిత్రపక్షాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నగరంలో నాలుగుచోట్ల 'సర్'కు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. మింట్ గడియార స్తంభం కూడలి వద్ద జరిగిన ఆందోళనలో ఎండీఎకే నేత వైగో, సీపీఎం నేత పి.షణ్ముగం, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ పాల్గొన్నారు. ఈ ధర్నాలో సుమారు వెయ్యిమందికిపైగా డీఎంకే, మిత్రపక్షాల కార్యకర్తలు పాల్గొని 'సర్'కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదే విధంగా సైదాపేట కలైంజర్ స్వర్ణోత్సవ స్వాగతతోరణం వద్ద జరిగిన ధర్నాలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ద్రావిడ కళగం ఉపాధ్యక్షుడు కలిపూంగుండ్రన్, ఎంపీలు తమిళచ్చి తంగపాండ్యన్, కనిమొళి సోము, ఎమ్మెల్యే ప్రభాకర్ రాజా, దిండుగల్ లియోని తదితరులు పాల్గొన్నారు. చేపాక్ శివానందసాలై వద్ద జరిగిన ఆందోళనలో డీఎంకే కోశాధికారి టీఆర్.బాలు, సీపీఐ మాజీ కార్యదర్శి ముత్తరసన్, డీఎంకే జిల్లా శాఖ కార్యదర్శి మయిలై వేలు, ఎమ్మెల్యే ఎళిలన్ తదితర నేతలు పాల్గొన్నారు. మాధవరం బజార్ వీధిలో జరిగిన ఆందోళనలో డీఎంకే జిల్లా కార్యదర్శి మాధవరం సుదర్శనం తదితరులు పాల్గొన్నారు. ఇదే రీతిలో చెంగల్పట్టులో మనిదనేయ మక్కల్ కట్చి నాయకుడు జవాహిరుల్లా, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, కాంచీపురంలో తమిళగ వాళ్వురిమై కట్చి నాయకుడు వేల్ మురుగన్, సీపీఎం సీనియర్ నేత జీ రామకృష్ణ నాయకత్వంలో ధర్నాలు జరిగాయి. ఈ ప్రదర్శనలలో డీఎంకే, దాని మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

తూత్తుకుడిలో...

తూత్తుకుడి చిదంబర నగర్ బస్టాండు వద్ద జరిగిన ఆందోళనకు డీఎంకే డిప్యూటీ కార్యదర్శి, ఆ పార్టీ ఎంపీ కనిమొళి నాయకత్వం వహించారు. డీఎంకే, మిత్రపక్షాలకు చెందిన స్థానిక శాఖ నాయకులు పాల్గొన్నారు. ఇదే విధంగా తిరువళ్లూరు, ఈరోడ్, తిరుచ్చి, మదురై, కోయంబత్తూరు, తంజావూరు, తిరువారూరు, తెన్‌కాశి, కళ్ళకురిచ్చి తదితర నగరాలలోనూ భారీ స్థాయిలో ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి.

పలు రంగాల్లో నిష్ణాతులకు ఆర్థిక సాయం

● అందజేసిన సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పర్యాటక సంస్కృతీ సంప్రదాయాలశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పేదరికంలో ఉన్న కలైమమాణి అవార్డు గ్రహీతలు పది మంది కళాకారులకు తలా రూ.లక్ష చొప్పున ఆర్థిసాయం, తమిళంలో శ్రేష్ఠమైన గ్రంథాలను ప్రచురించేందుకు ఐదుగురు రచయితలకు తలా రూ.2లక్షలు, కొత్త నాటకాలను ప్రదర్శించేందుకుగాను ఐదుగురు రంగస్థల కళాకారులకు తలా రూ.1.50లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో 525 మంది పేద కళాకారులకు సహాయాలను పంపిణీ చేశారు.

అర్చకులు, సిబ్బందికి ఇళ్ల కేటాయింపు...

ఇదే విధంగా సచివాలయంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెన్నై, చెంగల్పట్టు, కన్నియాకుమారి, ధర్మపురి జిల్లాల్లోని ఆరు దేవాలయాలలో పనిచేస్తున్న 16 మంది అర్చకులు, 31 మంది సిబ్బందికి ఆయా ఆలయాల వద్ద నిర్మించిన క్వార్టర్స్‌లో ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, దేవాదాయ పర్యాటక శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసగన్, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గస్తీ వాహనాల ప్రారంభం...

సచివాలయం వెలుపల పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు కొనుగోలు చేసిన 80 పింక్ పెట్రోలింగ్ వాహనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ కె.వెంకట్రామన్, ఎక్సైజు శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులు అందుకున్న అర్చకులు, సిబ్బందితో ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రత్యేక చిహ్నం కోసం టీవీకే దరఖాస్తు

● ఎన్నికల సంఘానికి అందజేసిన పార్టీ ప్రతినిధులు

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి ప్రత్యేక చిహ్నం కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) విజ్ఞప్తి చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న తమకు ఓడ, విజిల్, ఆటో, క్రికెట్ బ్యాట్ తదితర 10 గుర్తుల్లో ఒకదాన్ని కేయించాల్సిందిగా మంగళవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించింది. టీవీకే సంయుక్త ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్, సీనియర్ నాయకుడు అర్జున మూర్తి తదితరులు కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, ఇతర కమిషనర్లను కలిసి దరఖాస్తు అందించారు. గత ఫిబ్రవరి 7వ తేదీ కేంద్ర ఎన్నికల కమిషన్‌లో టీవీకే ప్రాంతీయ పార్టీగా రిజిస్టర్ అయ్యింది. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేసేందుకు సిద్ధమవుతున్న విజయ్ గెలుపే లక్ష్యంగా, పార్టీ తరఫున ఎన్నికల పర్యవేక్షణ, ప్రచార విభాగం, పోలింగ్ బూత్, ప్రచార సభలు, బహిరంగ సభల నిర్వహణకు తదితర సభలను నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీలను కూడా నియమించారు. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం, కొత్త పార్టీలు మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్నికల చిహ్నాన్ని పొందేందుకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ మేరకు టీవీకే తరఫున ఆ పార్టీ నేతలు చిహ్నం కోసం దరఖాస్తు సమర్పించారు. ఎన్నికల కమిషన్ మొత్తం 184 చిహ్నాలతో విడుదల చేసిన జాబితాలో పదింటిని ఎంపిక చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిని ఎన్నికల కమిషన్ పరిశీలించి ఒక గుర్తును ఇండిపెండెంట్‌గా కేటాయిస్తుంది. పార్టీకి కేటాయించే చిహ్నం నిర్ధారణ అయ్యాక దానిని ప్రజల్లోకి త్వరగా తీసుకెళ్లనున్నట్లు టీవీకే వర్గాలు తెలిపాయి.

వైభవంగా విష్వక్సేన ఇష్టి

● పెరంబూరులో ఆధ్యాత్మిక సందడి



హారతి ఇస్తున్న చిన్నజీయర్ స్వామి

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని ఎస్‌ఆర్ సిటీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సమతా ఇష్టి సేవా కమిటీ, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో సమత్వ, శాంతి, లోకకల్యాణార్థం మహాయజ్ఞంగా ప్రారంభమైన స్వాప్తాహ్నిక పంచకుండాత్మక 'సమతా ఇష్టి' ఆరో రోజు కార్యక్రమం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. సర్వత్రా విజయం ప్రాప్తించాలని ' విష్వక్సేన ఇష్టి' వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి దివ్య సంకల్పంతో తీర్థగోష్టి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం కార్యక్రమాల అనంతరం జీయరు స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ ధర్మాన్ని పాటించేవారికి సమాజంలో గౌరవం దక్కడంతో పాటు శాంతి చేకూరుతుందన్నారు. మానవులు పరస్పరం సమన్వయంతో నడుచుకుంటే శాంతి వర్ధిల్లుతుందని, ఈ లక్ష్యాన్ని నలుగురికి చేరువచేసే ప్రయత్నమే సమతా ఇష్టి అని జీయరు వివరించారు. సాయంత్రం గోపూజ, విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. ప్రముఖ నర్తకి అర్చన విష్ణుసహస్ర నామాలతో ప్రదర్శించిన భరతనాట్యం సభకులను ఆకట్టుకుంది. ఏడో రోజైన బుధవారం ఉదయం 9.30 గంటలకు లక్ష్మీనారాయణ ఇష్టి, సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర ఉంటుందని, 13వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీనివాస కల్యాణానికి భక్తులు హాజరుకావాలని జెట్ చెన్నై అధ్యక్షులు పి.రవీంద్రకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఆలయంలో దోపిడీ, హత్య !

● రాజపాళయంలో ఇద్దరు వాచ్‌మన్ల హత్య ● స్వర్ణాభరణాలు, పంచలోహ విగ్రహాల దోపిడీ



హత్య జరిగిన ఆలయం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన వాచ్‌మన్లు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా రాజపాళయంలోని నచ్చాడై తవిర్తరుళియ స్వామివారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి డ్యూటీలో ఉన్న ఇద్దరు వాచ్‌మన్లను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆ ఆలయంలో పేచ్చిముత్తు (50), శంకరపాండియన్ (65) అనే ఇద్దరు వాచ్‌మన్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం అర్చకులు వచ్చి ఆలయాన్ని తెరవగా ఆ ఇరువురూ రక్తపుమడుగులో శవాలుగా పడివున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. మూడువైపులా ఎత్తయిన ప్రహరీ ఉన్న ఆ ఆలయం చుట్టూ సీసీ కెమెరాలున్నాయి. ఆ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పోలీసులు పరిశీలించగా, సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు రెండు కార్లలో పదిమంది దుండగులు ఆలయానికి వచ్చి, సీసీ కెమెరాలను ఒక్కొక్కటిగా పగులగొట్టి, వెనుకవైపున్న స్తంభాల ఆధారంగా ఆలయ ప్రాంగణంలోకి దూకారు. ఆలయం లోపల ఉన్న వాచ్‌మన్లు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఆ దుండగులు వారిపై మారణాయుధాలతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత గర్భాలయంలోకి ప్రవేశించి విగ్రహాలకు ఉన్న బంగారు ఆభరణాలను, ప్రాచీన పంచలోహ విగ్రహాలను దోచుకెళ్ళారు. ఈ సమాచారం తెలుసుకుని మదురై సర్కిల్ డీఐజీ అభినవ్ కుమార్, ఎస్పీ కన్నన్ ఇతర పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ఆలయంలో సీసీ ఫుటేజీ ఆధారంగా కార్లలో వచ్చిన పదిమంది దుండగులు పథకం ప్రకారమే దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. ఆ పదిమందిలో కొందరు ఆలయం లోపలకు దూకి వాచ్‌మెన్లను హతమార్చి దోపిడీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా హంతకులను గుర్తించేందుకు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

అరియలూరు వద్ద లారీ బోల్తా

● పేలిన గ్యాస్ సిలిండర్లు ● మంటల్లో లారీ దగ్ధం



బోల్తాపడి పూర్తిగా దగ్ధమైన లారీ, చెల్లాచెదురుగా పడి ఉన్న గ్యాస్ సిలిండర్లు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లా కీళపళవూరు సమీపం వారణవాసి పిళ్లయార్ కోవిల్ సమీంలో వంట గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ రహదారి మలుపు వద్ద బోల్తాపడటంతో సిలిండర్లు పేలి చెల్లాచెదురయ్యాయి. ఈ రహదారి మలుపువద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తిరుచ్చి జిల్లా ఇనామ్ కొళత్తూరు సమీపంలోని ఇండేన్ గోదాము నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో అరియలూరు సమీపంలోని ఓ సంస్థకు మంగళవారం వేకువజామున లారీ బయలుదేరింది. ఆ లారీని కనకరాజ్ (35) అనే డ్రైవర్ నడిపాడు. ఆ లారీ వారణవాసి పిళ్ళయార్ గుడి సమీపంలోని రహదారిలో ఓ మలుపు వద్ద తిరుగుతుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న గోతిలో బోల్తాపడింది. లారీ డ్రైవర్ చాకచక్యంగా దూకి పరుగులు తీశాడు. ఆ లోగా లారీలోని సిలిండర్లు వరుసగా పేలి నలువైపులా మంటలు వ్యాపించాయి. సిలిండర్ల పేలుడు శబ్ధం కొన్ని కిలోమీటర్ల దూరం వరకు వినిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకు కీళపళవూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేసేందుకు శ్రమించారు. ఈ సంఘటనలో లారీ పూర్తిగా కాలి దగ్ధమైంది. గాయపడిన లారీ డ్రైవర్ కనకరాజ్‌ను చికిత్స నిమిత్తం అరియలూరు ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. జిల్లా కలెక్టర్ పి. రత్నసామి, ఎస్పీ విశ్వేష్ పి. శాస్త్రి, పోలీసులు అక్కడకు వెళ్ళి ఆ రహదారిలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రమాదంపై కేళపళవూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కార్తికేయ మిశ్రా - ఎంవీ నరసింహారావు - శోభా చంద్రశేఖర్

తిరుమల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ సీఎం అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండియన్ మాజీ క్రికెటర్ ఎంవీ నరసింహారావు, తమిళహీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ ఉన్నారు.



బంగారు పతకాలు, ప్రశంసాపత్రంతో వెంకటేష్

వృద్ధాప్యంలోనూ తగ్గేదేలే...

● ఈత పోటీల్లో తిరుపతివాసుల ప్రతిభ

తిరుపతి(క్రీడలు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయవాడలో గత ఆదివారం జరిగిన 6వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతికి చెందిన ఎ.వెంకటేష్(67), సి.జయశంకర్(58) ప్రతిభ కనబరిచారు. వేర్వేరుగా బ్యాక్, బ్రెస్ట్ స్ట్రోక్, ఫ్రీస్టయిల్ విభాగాలలో వెంకటేష్‌కు నాలుగు బంగారు, జయశంకర్‌కు రెండు చొప్పున సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. దీంతో నిర్వాహకులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిరువురు స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో స్విమ్మింగ్ శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో శశిధర్, కోచ్ చక్రవర్తి, పలువురు క్రీడాకారులు, ప్రముఖులు వారిని అభినందించారు.



సిల్వర్, బ్రాంజ్ పతకాలు, ప్రశంసాపత్రంతో జయశంకర్

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.01 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 76,096

తలనీలాలు సమర్పించినవారు: 26,289



ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకే..!

● ఎస్పీ సుబ్బరాయుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ అనేది సరదా కాదనీ, అదొక అమానుషమైన విషయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎవరైనా ఎక్కడైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్టు తమ దృష్టికి వస్తే జైలుకు పంపి కఠిన శిక్ష అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో మంగళవారం స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ కొత్తగా యూనివర్సిటీలో అడుగు పెట్టిన విద్యార్థులను భయపెట్టకుండా స్నేహపూర్వకంగా ప్రోత్సహించడం ప్రతి సీనియర్ బాధ్యత అని గుర్తు చేశారు. ర్యాగింగ్ ద్వారా ఎవరికీ ఆనందం రాదని, ఎదుటివారికి మానసిక క్షోభను కలిగిస్తుందన్నారు. అలాంటి ఘటనలు జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ర్యాగింగ్ ఘటనపై ఫిర్యాదు చేసిన వారికి పూర్తి రక్షణ, న్యాయం అందిస్తామని వివరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనేది విద్యార్థి జీవితాన్ని దెబ్బతీసే దుర్మార్గమైన అలవాటన్నారు. మన యూనివర్సిటీలో ప్రతీ విద్యార్థి సురక్షిత వాతావరణంలో చదువుకునే హక్కు ఉందన్నారు. ఆ హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. చదువుతో పాటు మంచి ప్రవర్తనను విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఇందుకోసం నిరంతరం సాధన చేయాలని కోరారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, సీడీసీ డీన్ చెంబ్రాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విమానాశ్రయంలో హైఅలర్ట్



రేణిగుంట నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనతో దేశంలోని ముఖ్యమైన విమానాశ్రయాలకు కేంద్ర ఇంటెలిజెన్స్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో విమానాశ్రయ సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి గాజులమండ్యం పోలీసులు ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ భద్రతా సిబ్బంది, సీఐ మంజునాథ్ రెడ్డి, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జర్మనీ వాణిజ్య ప్రతినిధుల బృందం



పాంటర్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీనిరాజు, సన్నారెడ్డి

సత్యవేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని సాక్సోని రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణ శాఖ మంత్రి డిస్క్ పాంటర్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌళిక వసతుల, విభిన్న రంగాల పరిశ్రమల ఎకో సిస్టం, అంతర్జాతీయ పెట్టుబడి దారులకు ఒనగూరే వ్యూహాత్మక వ్యాపార ప్రయోజనాలను డాక్టర్ సన్నారెడ్డి వివరించారు. 31 దేశాలకు చెందిన 240కు పైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, క్నాఫ్, కాంక్యో బర్డ్ పరిశ్రమలు సైతం ఉన్నాయని వారి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే బారత ప్రభుత్వం అందిస్తున్న పన్ను మినహాయింపులు, సబ్సిడీలు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడి దారుల అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శ్రీసిటీలో పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అనుకూలతలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రణాళిక, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అనుకూల విధానాలను ప్రశంసించిన పాంటర్ భవిష్యత్తులో మరిన్ని జర్మన్ సంస్థలు ఇక్కడ నెలకొల్పడానికి ఆసక్తి చూపుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతినిధిబృందం స్థానిక బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ పరిశ్రమను సందర్శించి, కార్యకలాపాలను పరిశీలించింది.

ట్రై మోటారు సైకిళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు మూడుచక్రాల మోటారు వాహనాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడుచక్రాల మోటారు వాహనాలను నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 25 నాటికి 18 సంవత్సరాలు పైబడి 45 లోపల ఉండాలని తెలిపారు. సదరం ధ్రువీకరణ ప్రకారం 70శాతం అంతకంటే ఎక్కువ ఉన్నవారు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు దాటకూడదన్నారు. మోటారు వాహనచట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.



అధికారులకు అవగాహన కల్పిస్తున్న బయాలజిస్టు రమేష్

పులుల గణనపై అటవీ అధికారులకు శిక్షణ

మంగళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో పులుల గణన ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా తిరుపతిలోని బయోట్రిమ్‌లో తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 20మంది ఎఫ్ఆర్వోలు, ఇద్దరు బయాలజిస్టులు, సిబ్బదికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. పులు గణన ఎలా చేపట్టాలి, ట్రాప్ కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై బయాలజిస్ట్ రమేష్ అవగాహన కల్పించారు. కొంతకాలం క్రితం శేషాచల అటవీప్రాంతంలో ఉనికి గుర్తింపుతో శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. శేషాచలాన్ని టైగర్‌కారిడార్‌గా ప్రకటించిన నేపథ్యంలో పెద్దపులులు సంచారం ఉందో లేదో త్వరలోనే స్పష్టంకానుంది. జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు బబిత, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారతదేశానికి తొలి విద్యాశాఖమంత్రిగా విశేష సేవలు అందించిన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డీఆర్వోనరసింహులు మాట్లాడుతూ గాంధేయవాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారన్నారు. బాలబాలికలకు సమాన విద్యావకాశాలు కల్పించాలని ఆయన పిలుపునిచ్చారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఈడీ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఒక రోజు పర్యటన నిమిత్తం బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. ఉదయం 11.20గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నేరుగా తిరుచానూరు బాలాజీ కల్యాణ మండపంలో జరిగే బీజేపీ మహిళా మోర్చా సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 3గంటలకు రేణిగుంట రోడ్డులోని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఆత్మనిర్భర్ భారత్ సెమినార్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో కలిసి కేంద్రమంత్రి పాల్గొంటారు. రాత్రి 7గంటలకు తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఓ వివాహానికి హాజరైన అనంతరం అక్కడి నుంచి తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వైజాగ్ బయలుదేరి వెళతారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 46 మందికి జరిమానా

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌పై తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 46 మందిపై, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 26 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వీరిని అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి సంధ్యారాణి విచారించారు. మద్యం తాగి వాహనం నడిపిన 46 మందికి రూ.పది వేల చొప్పున, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారికి రూ.500 చొప్పున రూ.13 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలనూ ప్రమాదంలోకి నెట్టే చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.

కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం



'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేసే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.



తస్మాత్.... జాగ్రత్త

● రుక్మిణి వసంత్

చిత్రజ్యోతి

విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'ఏస్' మూవీ ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన యంగ్ బ్యూటీ రుక్మిణి వసంత్ తన అభిమానులకు ఓ హెచ్చరిక చేశారు. తన పేరు మీద నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సైబర్ నేరగాళ్ళు సృష్టించారని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేస్తూ, 'నా సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయింది. ఆ ఖాతాల నుంచి వివిధ రకాలైన సందేశాలు వస్తున్నాయి. ముఖ్యంగా డబ్బు కావాలని కోరుతున్నారు. ఇలాంటి సందేశాలను ఎవరూ పట్టించుకోవద్దు. స్పందించవద్దు. ఈ విషయంలో ఏదైని సందేహం ఉంటే నన్ను లేదా నా బృందాన్ని సంప్రదించాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు. కాగా, శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' చిత్రంలో రుక్మణి నటనను పలువురు సినీ ప్రముఖులు ప్రశంసించారు.



'మాస్క్' ఆడియో రిలీజ్ కార్యక్రమంలో చిత్ర బృందం

నిర్మాతగా మారిన ఆండ్రియా

● 'మాస్క్' ఆడియో విడుదల

తమిళ చిత్రపరిశ్రమలో సింగర్‌గా, నటిగా గుర్తింపు పొందిన ప్రముఖ హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య నిర్మాతగా మారారు. మరో నిర్మాత చొక్కలింగంతో కలిసి ఆమె 'మాస్క్' అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీ ద్వారా వికర్ణన్ అశోక్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ పర్యవేక్షణలో ది షో మస్ట్ గో, బ్లాక్ మద్రాస్ ఫిల్మ్ పతాకంపై రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో కవిన్, ఆండ్రియా, రుహానీ శర్మ హీరో హీరోయిన్లుగా నటించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ లాంచ్ కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. ఇందులో నటుడు విజయ్ సేతుపతి, నిర్మాత కలైపులి ఎస్.థాను, దర్శకులు నెల్సన్ దిలీప్ కుమార్, సుబ్రహ్మణ్య శివ వంటి అనేక మంది సినీ ప్రముఖులు హాజరై ఆడియో రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాక్షలు తెలిపారు. చిత్ర దర్శకుడు వికర్ణన్ మాట్లాడుతూ, 'వెట్రిమారన్ సలహాలు, సూచలను వింటే జీవితంలో ఉన్నతస్థితికి చేరుకుంటారు. వెట్రిమారన్‌తో కలిసి నేను ఒక సినిమా రూపొందిస్తానని నేనే కాదు మా కుటుంబ సభ్యులు కూడా ఊహించలేదు. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. నిర్మాత, హీరోయిన్ ఆండ్రియా మాట్లాడుతూ, 'కవిన్ సినీ కెరీర్‌కు, నిర్మాతగా నాకు, హీరోయిన్ రుహానీ శర్మ, నిర్మాత చొక్కలింగంకు ఈ మూవీ ఎంతో కీలకం. ఈ నెల 21వ తేదీన విడుదల చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు. హీరో కవిన్ మాట్లాడుతూ, 'నా జీవితాన్ని సరైన మార్గంలో నడిపిస్తున్న దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్‌కు ధన్యవాదాలు. ఈ సినిమా స్టోరీ వెట్రిమారన్ వినిపించారు. ఆయనకు ఈ స్క్రిప్టుపై అంత నమ్మకం ఉంది. 21న రిలీజ్ అయ్యే ఈ మూవీని ప్రతి ఒక్కరూ చూసి ఆనందిస్తారని అని పేర్కొన్నారు.

జాసన్ సంజయ్ దర్శకత్వంలో
యాక్షన్ అడ్వెంచర్ 'సిగ్మా'

జాసన్ సంజయ్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా యాక్షన్ అడ్వెంచర్ మూవీ తెరకెక్కుతోంది. దీనికి 'సిగ్మా' అనే టైటిల్ ఖరారు చేసి మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. దక్షిణాదిలో భారీ బడ్జెట్, నాణ్యమైన సినిమాలు నిర్మించడంలో పేరుగాంచిన లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. నాలుగు నెలలుగా చిత్రీకరణ జరుపుతూ 95 శాతం మేరకు షూటింగ్ పూర్తి చేసుకుంది. యాక్షన్ అడ్వెంచర్‌తో పాటు హాస్యాన్ని జోడించి మూవీ రూపొందిస్తున్నారు. ఇందులో సందీప్ కిషన్‌ను పూర్తిస్థాయి యాక్షన్ హీరోగా చూడొచ్చు. హీరోయిన్‌గా ఫరీదా అబ్దుల్లా నటించగా, ఇతర పాత్రల్లో రాజు సుందరం, అన్బుదాసన్, యోగ్ జాబే, సంపత్ రాజ్, కిరణ్ కొండ, మహాలక్ష్మి సుదర్శనన్ తదితరులు నటించారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు జాసన్ సంజయ్ వివరిస్తూ, "సిగ్మా' అంటే ఎలాంటి భయం లేని స్వతంత్రమైన వ్యక్తి. ఈ సమాజం తప్పుగా అర్థం చేసుకున్నప్పటికీ తన లక్ష్యం కోసం ఎలా పోరాటం చేశాడన్నదే చిత్ర కథ. థమన్ శక్తివంతమైన సంగీతం, సందీప్ కిషన్ నటన ఖచ్చితంగా ప్రేక్షకులకు మరుపురాని అనుభూతినిస్తాయి. చిత్రీకరణ దాదాపుగా పూర్తయింది. ఒక పాట మాత్రమే మిగిలివుంది. తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ షూటింగ్ చెన్నై, సేలం, తలకోన, థాయిలాండ్‌లో చిత్రీకరించాం. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం' అని పేర్కొన్నారు.



'సిగ్మా'లో సందీప్ కిషన్



గునీత్ మోంగా, కార్తిక్ సుబ్బరాజ్, అచిన్ జైన్

కొత్త ప్రాజెక్టు ప్రారంభించిన కార్తీక్ సుబ్బరాజ్

ప్రముఖ బాలీవుడ్ నిర్మాత గునీత్ మోంగా కపూర్‌తో కోలీవుడ్ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ చేతులు కలిపి తన కొత్త ప్రాజెక్టు ప్రకటించారు. సిఖ్యా ఎంటర్‌టైన్మెంట్, స్టోన్ బెంచ్ ప్రొడక్షన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నాయి. ఈ సినిమా షూటింగ్ మదురైలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్‌కు చెందిన సిఖ్యా ఎంటర్‌టైన్మెంట్ సంస్థ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్‌తో కలిసి తొలిసారి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, 'సిఖ్యా నిర్మాణ సంస్థ నిర్మించిన చిత్రాలను చూసి ఎంతగానో ఆస్వాదించాను. సిఖ్యా అభిరుచి కూడా నా ఆలోచనలకు అనుగుణంగా ఉంటుంది. గునీత్, అచిన్‌లతో కలిసి పని చేయడం ఎంతో సంతోషంగా ఉంది. నేను రాసిన కథ నా హృదయానికి దగ్గరగా ఉంది' అని పేర్కొన్నారు. నిర్మాత గునీత్ మాట్లాడుతూ, 'సంస్కృతిలో మిళితమైన సహజసిద్ధ కథలను ప్రేక్షకులకు అందించేందుకు మేము ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాం. కార్తిక్ సుబ్బరాజ్ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటారు. కార్తిక్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.

ప్రధాని దీర్ఘకాల దృష్టి 'కాశి తమిళ సంగమం'

● గవర్నర్ ఆర్ఎన్ రవి



'కాశి తమిళ సంగమం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని ప్రాంతాలకు కాశితో సంబంధాలున్నాయని గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. స్థానిక ఐఐటీ మద్రాసు క్యాంపస్‌లో 'కాశి తమిళ సంఘం 4.0'ను సోమవారం గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... కాశి తమిళ సంగమం ప్రధాన మంత్రి మోదీ దీర్ఘకాల దృష్టి అన్నారు. ఆధ్యాత్మిక రాజధాని కాశితో, దేశంలోని అన్ని ప్రాంతాలకు సంబంధాలున్నాయని తెలిపారు. కాశి తమిళ సంగమం లాంటి కార్యక్రమం నిర్వహించడం కష్టతరమైనదన్నారు. ప్రజలను ఎంపిక చేసి వారిని తీసుకెళ్లడం సామాన్య విషయం కాదన్నారు. ఈ పనులను ఐఐటీ డైరెక్టర్ కామకోటి చక్కగా నిర్వహించారని కొనియాడారు. సంస్కృతి అనేది ప్రభుత్వం నడిపేది కాదని, అది ప్రజల నుంచి పుడుతుందన్నారు. అలాంటి దానిని రాజకీయం చేయవద్దని సూచించారు. ఈ ఏడాది కాశి తమిళ సంగమం వేడుకలు 'తమిళం నేర్చుకోండి' అనే శీర్షికన నిర్వహించనున్నామన్నారు.ఉత్తరప్రదేశ్ నుంచి 300 మంది విద్యార్థులు తమిళం నేర్చుకునేందుకు రాష్ట్రానికి వచ్చారని తెలిపారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా తమిళం నేర్చుకునేలా కేంద్ర ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోందన్నారు. అసోం నుంచి వచ్చిన విద్యార్థులకు రాజ్ భవన్‌లో తమిళం నేర్పించామన్నారు. 'ఒకే భారతం-అత్యున్నత భారతం' అనేది రాజకీయ నినాదం కాదని గుర్తించుకోవాలన్నారు. ఒకే కుటుంబ సభ్యులు కలిగిన పవిత్ర దేశమని, సాంస్కృతిక వారసత్వాన్ని, మనం కోల్పోయిన వాటిని తిరిగి పొందేందుకు ప్రయత్నించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాసు డైరెక్టర్ కామకోటి, కేంద్ర సెమ్మొళి తమిళ పరిశోధన సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుధా శేషయన్, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ చంద్రశేఖరన్, పారిశ్రామికవేత్త నల్లి కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల ద్వారా మట్టికుండలు పంపిణీ చేయాలి

● కుమ్మరి సంఘం డిమాండ్



కలెక్టరేట్ ముందు మట్టికుండలతో ధర్నా

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా రేషన్‌కార్డుదారులకు మట్టికుండ, పొయ్యి కానుకగా అందజేయాలని తమిళనాడు కుమ్మర్ల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక హార్బర్ నియోజకవర్గంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సంఘ అధ్యక్షుడు సేమా నారాయణన్ నేతృత్వంలో మట్టికుండలు, పొయ్యితో కుమ్మర్లు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సేమా నారాయణ మాట్లాడుతూ, పొంగల్ సందర్భంగా కుటుంబ కార్డుదారులకు చౌకదుకాణాల ద్వారా బియ్యం, బెల్లం, జీడిపప్పు, చెరకుగడ తదితరాలను కానుకగా ఇస్తున్నట్లే పొంగల్ వండేందుకు మట్టికుండ, పొయ్యి కూడా పంపిణీ చేయడంపై రాష్ట్రప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తమ కోరిక నెరవేరితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మందికి ఆర్థికంగా లబ్ధికలుగుతుందన్నారు. బంకమట్టితో తయారు చేసే మట్టిపాత్రల్లో వండే ఆహారం తినడంవల్ల కలిగే లాభాలను విద్యార్థులు తెలుసుకునేలా పాఠ్యాంశంగా చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేశారు. ఈ ధర్నాలో గణపతి, మహేష్‌కన్నన్, ఎస్ఎన్ పళని, అడ్వకేట్ రాజన్, కె.ఆనందన్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ యువత సాధికారతే లక్ష్యంగా..
హెచ్‌సీఎల్ ఫౌండేషన్‌తో
తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా విలాత్తికుళం, పుదూర్‌లో గ్రామీణ యువతకు డిజిటల్ టెక్నాలజీ నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా హెచ్‌సీఎల్ ఫౌండేషన్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఉపముఖ్యమంత్రి ఉదయనిధి సమక్షంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రాబోయే 36 నెలల్లో 95 గ్రామ పంచాయతీలకు చెందిన 2,500 మంది యువతకు శిక్షణ, నియామక మద్దతు అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పారిశ్రామిక వృద్ధి ప్రయోజనాలు రాష్ట్రంలోని ప్రతి మూలకు, ముఖ్యంగా తూత్తుకుడి వంటి అభివృద్ధి చెందుతున్న కేంద్రాలకు చేరేలా తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఇందులో భాగంగానే హెచ్‌సీఎల్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతికుమార్, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ అలోక్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



చెన్నై సచివాలయం వెలుపల నగరంలో మహిళల సంరక్షణ కోసం పోలీసు శాఖ కొనుగోలు చేసిన పింక్ పెట్రోలింగ్ వాహనాలను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

గ్లోబల్ టాలెంట్ పవర్ హౌస్‌గా భారత్



నివేదిక ఆవిష్కరణ దృశ్యం

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఐఐ, ఏఐసీటీఈ, ఏఐయూ, టాగ్డ్ సహకారంతో ప్రపంచ విద్య, ప్రతిభ పరిష్కార సంస్థ అయిన ఈటీఎస్ తాజాగా ఇండియా స్కిల్ నివేదిక విడుదల చేసింది. ఇది భారతదేశ శ్రామిక శక్తి అభివృద్ధి చెందుతున్న గతిశీలతను, భవిష్యత్తు కోసం దాని సంసిద్ధతను తెలియజేస్తోంది. ఈ నివేదికను ఈటీఎస్ సీఈవో నిర్మల్ సింగ్ ఇటీవల నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025లో భారత ఉపాధి సామర్థ్యం 54.81 ఉండగా, 2026లో 56.35కి పెరుగుతుందని తమ నివేదికలో తేలినట్లు వివరించారు. ఇది ఏఐ స్వీకరణ, డిజిటల్ నైపుణ్యం, ప్రపంచ చలనశీలత ద్వారా నడిచే నైపుణ్యం - ముందు ఆర్థిక వ్యవస్థ వైపు నిర్ణయాత్మక మార్పును సూచిస్తుందని వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న సమాంతర శ్రామిక శక్తిని పని భవిష్యత్తు మారుస్తోందని, ఇది దేశం నుంచే ప్రారంభమవుతుందని వివరించారు.

పారిశుధ్య కార్మికుల భోజనానికి రూ.64 కోట్లు కేటాయించిన జీసీసీ

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో పనిచేస్తున్న 31,373 మంది పారిశుధ్య కార్మికులకు భోజనం అందించేందుకు రూ.64 కోట్లు ఖర్చు కానుంది. వారికి మూడు పూటలా అందజేసే ఆహార పదార్థా వివరాలను జీసీసీ విడుదల చేసింది. పారిశుధ్య పనులు ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టిన పారిశుధ్య కార్మికులను శాంతింపజేసేలా, వారి వేతనాన్ని రూ.585 నుంచి రూ.761కి పెంచారు. అలాగే, మూడు పూటలా భోజనం అందించాలని నిర్ణయించింది. ఆహార పథకాన్ని ఈ నెల 15వ తేది ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ పథకం పరిశీలనకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ పథకం ద్వారా జీసీసీ పరిధిలో 31,373 మంది పారిశుధ్య కార్మికులు లబ్ధిపొందనున్నారు. ఈ పథకానికి ఏడాదికి రూ.64.73 కోట్లు ఖర్చుకానుండగా, 'ఫుడ్ స్వింగ్ ఎంటర్‌ప్రైజెస్' ఆహారం సరఫరా చేయనుంది.

రోజూ అందించే ఆహార పదార్థాల పట్టిక...


వారం	అల్పాహారం	మధ్యాహ్న భోజనం	రాత్రి భోజనం
సోమవారం	ఇడ్లి, వడ, సాంబారు	సాంబారు అన్నం, తాళింపు	ఇడ్లి, కారపు చట్నీ సాంబారు
మంగళవారం	కిచిడి, కారపు చట్నీ	లైమ్ రైస్, తాళింపు	చపాతి, కుర్మా
బుధవారం	పొంగల్, సాంబారు	వెజ్ బిర్యానీ, వంకాయ పచ్చడి	రవ్వ కిచిడి, సాంబారు
గురువారం	రవ్వ ఉప్మ, చట్నీ	టమోటా అన్నం, బంగాళాదుంప	చపాతి, మసాలా
శుక్రవారం	ఇడ్లి, సాంబారు	కొత్తిమీర, పుదీనా అన్నం, తాళింపు	ఇడ్లి, చట్నీ సాంబారు
శనివారం	రవ్వ ఉప్మ, సాంబారు	చింతపండు అన్నం, తాళింపు	రవ్వ ఉప్మ, చట్నీ
ఆదివారం	సేమియా కిచిడీ, సాంబారు	వెజ్ బిర్యానీ, వంకాయ పచ్చడి	చపాతి, కుర్మా



● మాదకద్రవ్యాల కేసు..
ఈడీ విచారణకు హీరో శ్రీకాంత్ హాజరు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం కేసులో హీరో శ్రీకాంత్ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారుల విచారణకు హాజరయ్యారు. నుంగంబాక్కం లేక్ ఏరియాలో నివసిస్తున్న ప్రముఖ నటుడు శ్రీకాంత్ మాదక ద్రవ్యాలనువాడటంతోపాటు, వాటిని సహనటీనటులకు కూడా సరఫరా చేశాడనే ఆరోపణలపై జూన్ 23న అరెస్టయ్యారు. శ్రీకాంత్‌తోపాటు మరో నటుడు కృష్ణను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మాదక ద్రవ్యాల కేసులో భారీ యెత్తున నగదు బట్వాడా జరిగినట్లు తెలియడంతో ఈడీ అధికారులు కూడా విచారణ చేపట్టారు. అక్టోబరు 28న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని శ్రీకాంత్‌కు ఈడీ సమన్లు పంపింది. అయితే అనారోగ్య కారణాల వల్ల ఆ రోజున హాజరుకాలేనని శ్రీకాంత్ తన న్యాయవాదుల ద్వారా ఈడీకి తెలియజేశారు. ఆ మేరకు ఈ నెల 11న తప్పకుండా విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్ జారీ చేసింది. ఆ మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 185 వినతులు



అధికారులు, పోలీసుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు సమస్యల పరిష్కార శిబిరం నిర్వహించారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నగర పోలీసు కమిషనర్‌గా అరుణ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత, పోలీసు శాఖలో అధికారులు, పోలీసులు సమస్యలు తెలిపేలా ప్రతి మంగళవారం పోలీసు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అందులో భాగంగా, మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో, ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు, 14 మంది సీఐలు, 37 మంది ఎస్ఐలు,129మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు కార్యాలయ సిబ్బంది పాల్గొని, 185 వినతిపత్రాలు సమర్పించారు. బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం సమస్యలు సహా పలు విషయాలపై అధికారులు, పోలీసులు వినతిపత్రాలు సమర్పించారు. వారి సమస్యలు సావధానంగా విన్న నగర పోలీసు కమిషనర్ అరుణ్, సమస్యలు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ప్రకటనలో తెలిపింది.

16న కార్తిక వనభోజనాలు

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆంధ్ర కళా స్రవంతి (ఏకేఎస్), తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ (టీఎన్‌టీపీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని డివైన్ గార్డెన్‌లో కార్తిక మాస వనభోజన కార్యక్రమం జరుగనుంది. దీనికి సంబంధించి సోమవారం సాయంత్రం కొరట్టూర్ అగ్రహారంలోని కోదండరామాలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ జరిగింది. ఏకేఎస్ అధ్యక్షులు జేఎం నాయుడు, కార్యదర్శి జె.శ్రీనివాస్, టీఎన్‌టీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు దేవరకొండ రాజు, ప్రధాన కార్యదర్శి కె.దేవరాజు తదితరులు పాల్గొన్నారు. వనభోజనాల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన తెలుగువారు జేఎం నాయుడు 9840066999, సూర్యకుమారి 9940423688 అనే నెంబర్లను సంప్రదించవచ్చు.



కార్యక్రమంలో దేవరకొండ రాజు, జేఎం నాయుడు తదితరులు

సమాచార దృష్టి

మూడు కొలనుల మరమ్మతులకు రూ.1.1 కోట్లు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం మండల పరిధిలోని మూడు కొలనుల మరమ్మతులకు రూ.1.1 కోట్లు కేటాయించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలియజేసింది. ఆ ప్రకారం, రామచంద్ర కొలను. పడవేట్టమ్మన్ ఆలయ కొలను. ఊత్తుకుళం తదితర మూడు కొలనులు అభివృద్ధి చేయనున్నారు. వర్షపు నీరు సేకరించి, భూగర్భ నీటిమట్టాలు పెంచడం, ప్రజలు వినియోగించుకునేలా వసతులు మెరుగుపరచనున్నట్లు తెలిపింది.

రాష్ట్రంలో కొత్తగా 50 ఆధార్ సేవా కేంద్రాలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 50 శాశ్వత ఆధార్ సేవా కేంద్రాలు ప్రారంభించనున్నట్లు 'ఎల్కాట్' తెలిపింది. రాష్ట్ర సమాచార సాంకేతిక, డిజిటల్ సేవల శాఖ (ఎల్కాట్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 266 శాశ్వత ఆధార్ సేవా కేంద్రాలుండగా, కొత్తగా 50 కేంద్రాలను ప్రారంభించనున్నారు.. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ ఆధ్వర్యంలో 321 ఆధార్ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రజలు ఈ కేంద్రాల్లో సేవలు పొందవచ్చు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు ఆధార్ నమోదుచేసుకునేలా 16 జిల్లాల్లో 79 శిబిరాలు నడుపుతున్నట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈనెల 13వ తేది గురువారం జరుగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... కోయంబేడు సమీపంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత నేతృత్వంలో సమావేశం జరుగనుంది. రాబోయే శాసనసభ ఎన్నికలకు సంబంధించిన కీలక అంశాలు సమావేశంలో చర్చించనున్నట్లు, జిల్లా కార్యదర్శులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని పార్టీ ప్రధాన కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్‌లో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీచేయనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... నొచ్చికుప్పం, ఎళిల్ నగర్, షోలింగనల్లూర్, కన్నిగి నగర్, సెమ్మంజేరి ప్రాంతాల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://chennai.nic.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, పూర్తి చేసిన దరఖాస్తులు, తగిన సర్టిఫికెట్లతో ఈ నెల 21వ తేది సాయంత్రం 5 గంటల్లోపు 'జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం, 8వ అంతస్తు, సింగారవేలర్ మాలిగై, రాజాజీ రోడ్డు, చెన్నై-1' అనే చిరునామాలో నేరుగాను, oscchennaib@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాలోను దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఆందోళనలో పాల్గొంటే వేతనం కట్

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడువ ఎలక్ట్రిసిటీ బోర్డు ఎంప్లాయిస్ ఫెడరేషన్' ఈ నెల 15వ తేది విద్యుత్ బోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ విషయమై విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ఆ రోజు ఆందోళనలో పాల్గొనే కార్మికులకు 'విధులు లేవు అంటే వేతనం లేదు' అనే నిబంధన మేరకు ఒకరోజు వేతనం జమ చేసుకోవాలని జిల్లా ప్రధాన ఇంజనీర్లకు విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.

'ఆన్‌లైన్'లో భూ వినియోగ మార్పు, భవన ధ్రువీకరణ పత్రాలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూ వినియోగం మార్పు, భవన పూర్తి ధ్రువీకరణ పత్రాల కోసం 'ఆన్‌లైన్' విధానం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి సంస్థ ప్రకటించింది. చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ), టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ (టీటీసీపీ), స్థానిక సంస్థల ద్వారా భవన నిర్మాణానికి అనుమతులిస్తుంటాయి. ఈ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చారు. ప్రజలు, నిర్మాణ సంస్థలు http://onlineppa.tn.gov.in/SWPweb/login అనే వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఈ విధానం ద్వారా ప్రతి విభాగ అధికారిని వ్యక్తిగతంగా కలవాల్సిన అవసరం లేకుండా చేయడంతో పాటు ప్రాసెసింగ్ సమయం కూడా తగ్గుతుందని అధికారులు తెలిపారు.

పరీక్షకు భయపడి 'కిడ్నాప్' నాటకం

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరీక్షకు భయపడి, కిడ్నాప్ నాటకమాడిన పాఠశాల విద్యార్థిని పోలీసులు రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. పులియాంతోపు జిల్లా పోలీసు పరిధికి చెందిన 15 ఏళ్ల విద్యార్థిని 10వ తరగతి చదువుతోంది. చూలై అంకాళమ్మన్ ఆలయ సమీపంలో, సోమవారం ఉదయం విద్యార్థిని ఏడుస్తూ కూర్చుని ఉండగా గమనించిన భవాని అనే మహిళ ఆమెను విచారించగా... పాఠశాలకు వెళుతుండగా, ఆటోలో వచ్చిన ముగ్గురు మహిళలు కిడ్నాప్ చేశారని, వారిని నుంచి తప్పించుకుని వచ్చినట్లు తెలిపింది. విద్యార్థిని తల్లిదండ్రులు, ఓట్టేరి పోలీసులకు భవాని సమాచారం ఇచ్చింది. బాలికతో కలిసి ఆమె చెప్పిన కిడ్నాప్ జరిగిన ప్రాంతానికి వెళ్లిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా, విద్యార్థిని చెప్పింది అవాస్తవమని తెలిసింది. విద్యార్థిని తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఆమెను వారికి అప్పగించారు. చివరగా, పరీక్షకు భయపడి తాను కిడ్నాప్ నాటకమాడినట్లు సదరు విద్యార్థిని అంగీకరించింది. దీంతో, ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు, ఆమెను తల్లిదండ్రులతో పంపించారు.

● బహిరంగ సభలకు మార్గదర్శకాలు..

రాష్ట్ర ప్రభుత్వానికి పది రోజుల గడువు విధించిన హైకోర్టు



పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల బహిరంగ సభలు, రోడ్ షోలకు సంబంధించిన ముసాయిదా మార్గదర్శకాల సమర్పణకు రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు పది రోజులు అవకాశమిచ్చింది. కరూర్‌లో సెప్టెంబరు 27వ తేది తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది మృతిచెందిన నేపథ్యంలో, రాజకీయ పార్టీలు నిర్వహించే రోడ్ షోలకు మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆ సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు చీఫ్ అడ్వకేట్ రవీంద్రన్, బహిరంగ సభలు, రోడ్‌షోలకు సంబంధించిన ముసాయిదా మార్గదర్శకాల రూపకల్పనకు సంబంధించి ప్రభుత్వ వివిధ స్థాయిలో సంప్రదింపులు జరుపుతోందని, అందులో భాగంగా ఈనెల 6వ తేది నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో 20కి పైగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారని వివరించారు. ఎన్నికల సంఘం వద్ద నమోదైన 40కి పైగా పార్టీలకు ముసాయిదా మార్గదర్శకాలు పంపి, వారి అభిప్రాయాలు కోరినట్లు తెలిపారు. వారి అభిప్రాయాలు అందిన తర్వాత సంబంధిత శాఖ అధికారులను సంప్రదించి తుది ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించేందుకు నెల సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకుని, ఒక్కో పార్టీకి ఒక్కో విధమైన నిబంధనలు విధిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. అలాగే, చివరి నిముషంలో పంపినట్లు ఆరోపణలున్నాయని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు బహిరంగ సభలు, రోడ్ షోలకు అనుమతిచ్చేటప్పుడు అనవసరమైన షరతులు విధించవద్దని, 15 రోజుల ముందుగా దరఖాస్తు చేసుకుంటే 5 నుంచి 7 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి ప్రభుత్వానికి సూచించారు. అన్ని పార్టీల అభిప్రాయాలు ప్రభుత్వం వద్ద ఉన్న నేపథ్యంలో, రిజిస్టర్ పార్టీలైన టీవీకే, దేశీయ మక్కల్ శక్తి పార్టీల తరఫున ముసాయిదా మార్గదర్శకాలు వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్రతిపాదనలు పరిశీలించి, ఈ నెల 20వ తేదిలోపు ముసాయిదా మార్గదర్శకాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పది రోజులు గడువు విధించిన ధర్మాసనం, తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది.

చెన్నైలో 45 శాతం దరఖాస్తుల పంపిణీ

● 25 శాతం మంది జాబితా నుంచి తొలగింపు?

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలో ఈ నెల 4న ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఇప్పటి వరకు 45 శాతం మంది ఓటర్లకు దరఖాస్తులు పంపిణీ చేసినట్లు చెన్నై జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్ ప్రకటించారు. ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 61.34 శాతం మంది ఓటర్లకు సవరణలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు తెలిపారు. పెరంబలూరు జిల్లాలో అధికపక్షంగా 94.41 శాతం మంది ఓటర్లకు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నగరానికి సంబంధించినంతవరకూ 16 నియోజకవర్గాల్లో 40లక్షల మంది ఓటర్లకు 3718 మంది ఎన్నికల సిబ్బంది ద్వారా 16.35 లక్షల మందికి ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పుల కోసం దరఖాస్తు ఫారాలను అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం నగరమంతటా జరిగిన పరిశీలనలను బట్టి సుమారు 25 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించే అవకాశాలు న్నట్లు తెలిపారు. రాయపురం, వాషర్‌మెన్ పేట ప్రాంతాల్లో సుమారు 400 మంది ఇళ్లను ఖాళీ చేసి వెళ్లారని, ఉద్యోగులు బదలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వీరి పేర్ల జాబితా నుండి తొలగిస్తామన్నారు. ఇదే విధంగా జాఫర్‌ఖాన్‌పేట, మైలాపూరు, పురుషవాక్కం నియోజకవర్గాలలో దరఖాస్తుల పంపిణీకి సిబ్బంది వెళ్శితే వందకుపైగా ఇళ్ళలోనివారి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. గత ఏడు రోజులుగా ఇళ్లు ఖాళీ చేయడం, బదిలీపై వెళ్ళడం వంటి కారణాల వల్ల ఎన్నికల సిబ్బంది 25 శాతం మంది ఓటర్లకు దరఖాస్తులను అందించలేకపోవడంతో అంతే శాతం మంది ఓటర్లను జాబితా నుండి తొలగించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

14వేల ఎకరాల్లో పంట నష్టం: వ్యవసాయ శాఖ



పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లో, కోతకు సిద్ధంగా ఉన్న 14వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ నిర్ధారించింది. తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం తదితర డెల్టా జిల్లాల్లో ప్రస్తుతం 6.5 లక్షల ఎకరాల్లో కురువై వరి సాగు చేపట్టారు. ఈ కారణంగా వరి ఉత్పత్తి పెరిగింది. కోతలు ముగిసినా ధాన్యం కొనుగోలు చేయడంలో ఆహార శాఖ జాప్యం చేసింది. ఈ కారణంగా, కొనుగోలు కేంద్రాల వెలుపల ఉంచిన ధాన్యం బస్తాలు, ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిపోయాయి. అలాగే, నాట్లు ఆలస్యంగా జరిగిన ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట నీటమునిగింది. పంట చేతికి అందే సమయంలో కురిసిన వర్షాలకు వరి నీటమునగడంతో రైతులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. అదే సమయంలో, సంబా పైరుకు కూడా నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ ఆదేశాలతో డెల్టా జిల్లాల్లో నష్టపోయిన కురువై, సంబా పంటను అధికారులు లెక్కించారు. గణనలో... డెల్టా జిల్లాల్లో కోతకు సిద్ధంగా ఉన్న 14వేల ఎకరాల్లో పంట నీటమునిగిందని నిర్ధారణ అయిందని, ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని, రైతులకు పరిహారం అందించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

కన్నియాకుమారిలో ఇద్దరు బాలికల పట్టివేత

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు బాలికలను పోలీసులు రక్షించారు. కన్నియాకుమారికి వచ్చే భక్తులు, పర్యాటకులకు రక్షణ కల్పించేలా జిల్లా ఎస్పీ స్టాలిన్ గత ఏప్రిల్‌లో 'టూరిస్ట్ పోలీసు' పథకం ప్రారంభించారు. పోలీసులు తీరప్రాంతాల్లో గస్తీ తిరుగుతుంటారు. ఈ క్రమంలో సోమవారం టూరిస్ట్ పోలీసులు గస్తీ తిరుగుతుండగా కన్నియాకుమారి బీచ్ ప్రాంతంలో ఇద్దరు బాలికలు సంచరించడం గమనించి విచారించారు. వారిలో 15 ఏళ్ల చెన్నైకి చెందిన బాలిక సెప్టెంబరులో ఇంటి నుంచి బయటకు వచ్చిందని, ఈ విషయమై చింతాద్రిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది. మరో 18 ఏళ్ల బాలిక తెలంగాణ రాష్ట్రానికి చెందినదని గుర్తించారు. ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారికి అప్పగించే చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా బాలికలను రక్షించిన టూరిస్ట్ పోలీసు బృందాన్ని ఎస్పీ స్టాలిన్ అభినందించారు.

శ్రీరంగంలో 'సర్' పనుల్లో డీఎంకే ఐటీ విభాగం సభ్యురాలు

● మహిళా వీఏఓ తొలగింపు



డీఎంకే ఐటీ విభాగం సభ్యురాలు

చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగం నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులకు సంబంధించి డీఎంకే ఐటీ విభాగం సభ్యురాలు, ఆ పార్టీ పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జి ఓటర్లకు దరఖాస్తులను పంపిణీ చేయడం వివాదాస్పదంగా మారింది. దరఖాస్తులను పంపిణీ చేయాల్సిన వీఏఓ ముత్తమిళ్‌సెల్వి ఆ పనులను డీఎంకే ఐటీ విభాగం సభ్యురాలికి అప్పగించింది. దీంతో డీఎంకే ఐటీ విభాగం సభ్యురాలు ఓటర్లకు సవరణకు సంబంధించి దరఖాస్తులను పంపిణీ చేస్తున్న వీడియో బీజేపీ స్థానిక నేతలు సోషల్ మీడియాలో విడుదల చేశారు. బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు సర్ విధుల నుంచి వీఏఓ ముత్తమిళ్ సెల్విని జిల్లా కలెక్టర్ శరవణన్ తొలగించారు. ఆమెకు బదులుగా గ్రామ నిర్వహణాధికారి సహాయకుడిగా ఉన్న విగ్నేష్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సీఎం స్టాలిన్ నియోజకవర్గంలో 9వేల నకిలీ ఓట్లు

● బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

వేలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా వాణియంబాడిలో బీజేపీ సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరులో సుమారు 9వేల నకిలీ ఓటర్లు ఉన్నారని ఆరోపించారు. సర్‌ను డీఎంకే నాయకులు అడ్డుకుంటున్నారని, సర్ నిర్వహణపై డీఎంకేకు ఎందుకింత భయమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎటు చూసినా లైంగిక వేధింపులు, దొంగతనాలు, మాదకద్రవ్యాల విక్రయం యథేచ్ఛగా సాగుతున్నాయని, దీనిపై రాష్ట్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ అవినీతి డీఎంకేను 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపుతారని ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే నేత, మాజీమంత్రి వీరమణి, వాణియంబాడి ఎమ్మెల్యే సెంధిల్‌కుమార్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్తికేయన్, వెంకటేశన్, జిల్లా అధ్యక్షుడు దండపాణి సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

డీపీఐ నాయకుడి హత్య కేసులో పది మందికి యావజ్జీవం

అడయార్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో డీపీఐ నాయకుడు హత్యకేసులో పది మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ మంగళవారం కోర్టు తీర్పునిచ్చింది. అరుంగుణం పంచాయతీ అధ్యక్షుడైన సుభాష్, డీపీఐ పార్టీ యూనియన్ కార్యదర్శిగా వ్యవహరించారు. 2020 జూలైలో సుభాష్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై నెల్లికుప్పం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పాతకక్షల కారణంగా ఈ హత్య జరిగిందని తెలిసింది. అదే గ్రామానికి చెందిన దామోదరన్‌కు సుభాష్‌కు పాతకక్షలుండేవని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోయిన దామోదరన్ ఈ దారుణానికి పాల్పడ్డారని పోలీసుల విచారణలో తెలిసింది. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన న్యాయవాది ధర్మరాజ్ సహా 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో విచారణలో ఉన్న సమయంలో ఒకరు మృతిచెందగా, ఒకరిని కోర్టు విడుదల చేసింది. మిగిలిన 10 మందిపై నేరారోపణ నిరూపణ కావడంతో, న్యాయవాది సహా 10 మందికి యావజ్జీవశిక్ష విధిస్తూ న్యాయమూర్తి సరస్వతి తీర్పు వెలువరించారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణంలో భారీగా పోలీసులు మోహరించారు.

సర్‌కు వ్యతిరేకంగా డీఎంకే నిరసన



నిరసన సభలో డీఎంకే, కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తలు

వేలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా డీఎంకే కూటమి నేతల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వేలూరులో నిరసన సభ జరిగింది. ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యే నందకుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కాంగ్రెస్, సీపీఎం సహా డీఎంకే కార్యకర్తలు పాల్గొని సర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

క్షమాపణ చెబితే మళ్లీ పార్టీలోకి

● మాజీ మంత్రి ఓఎస్ మణియన్

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ నుంచి వెళ్లిన వారు మొదట క్షమాపణలు చెప్పాలని, ఆ తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఓఎస్ మణియన్ తెలిపారు. మైలాడుదురై జిల్లా వళవూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కొత్త విధానం కాదన్నారు. కొత్త పద్ధతిని ఎన్నికల కమిషన్ చేపట్టిందనే విమర్శ అవసరం లేదన్నారు. సర్‌తో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది, నష్టం కలుగదన్నారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా సర్‌ను వ్యతిరేకించడం లేదని, తక్కువ సమయంలో చేపట్టడం సరికాదని మాత్రమే చెబుతున్నారని ఓఎస్ మణియన్ తెలిపారు.

నగలు, నగదు కాజేసిన డీఎస్పీ కుమారుడి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతి నుంచి నగలు, నగదు కాజేసిన డీఎస్పీ కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దిండుగల్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న కోవైకి చెందిన తంగపాండి కుమారుడు తరుణ్, హాస్టల్ ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. తరుణ్‌కు పొల్లాచ్చికి చెందిన 25 ఏళ్ల యువతితో వాట్సాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ నెల 2వ తేది కలుసుకుందామని చెప్పి ఆ యువతిని రప్పించిన తరుణ్, ఆమె నుంచి మూడు సవర్ల నగలు, గూగుల్ పే ద్వారా రూ.90వేల కాజేసినట్లు సమాచారం. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు, తరుణ్‌ను అదుపులోకి తీసుకుని, అతనికి సహకరించిన మరో యువకుడి కోసం గాలిస్తున్నారు.

రైతు హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతు హత్య కేసులో ఇద్దరికి న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించింది. తిరుచెందూర్‌కు చెందిన రైతు శివగురుకు అదే ప్రాంతానికి చెందిన సెంథిల్ కుమార్, వెంబడిదురైకు పాతకక్షలుండేవి. 2016లో ఇద్దరూ శివకుమార్‌ను పార్టీకి పిలిచారు. పార్టీలో మద్యం సేవించిన శివకుమార్‌ను ఇద్దరు గొంతుకోసి హతమార్చారు. ఈ కేసు జిల్లా న్యాయస్థానంలో విచారణలో ఉండగా, నేరారోపణలు రుజువు కావడంతో, సెంథిల్‌కుమార్, వెండిదురైకు యావజ్జీవ శిక్ష, తలా రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.

బైక్ ప్రమాదంలో జిమ్ ట్రైనర్ మృతి



మృతుడు ప్రభు నవీన్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రహదారిలో బైక్‌పై వెళ్తూ ఆవును ఢీకొన్న ఘటనలో జిమ్ ట్రైనర్ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే రాణిపేట జిల్లా అరక్కోణం గోపాల్‌నగర్‌కు చెందిన ప్రభు నవీన్ (39) ఆ ప్రాంతంలోని జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. చెన్నై నగరానికి వచ్చి, తిరిగి వెళ్తుండగా తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని వ్యాసపురం గ్రామం వద్ద ఓ ఆవు రోడ్డుమీదకు రాగానే దానిని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రభు నవీన్ అక్కడికక్కడే మృతి చెందగా, గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

● ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు...

అశ్వత్థామన్ సహా 12 మందికి బెయిలు

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో, అశ్వత్థామన్ సహా 12 మందిని న్యాయమూర్తి బెయిలు మంజూరు చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్, గత ఏడాది ఆయన ఇంటి సమీపంలో దారుణహత్యకు గురయ్యాడు. ఈ కేసులో ప్రముఖ రౌడీ నాగేంద్రన్, ఆయన కుమారుడు అశ్వత్థామన్ సహా 27 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనారోగ్యం కారణంగా నాగేంద్రన్ ఇటీవల మృతి చెందాడు. ఈ కేసులో జామీను కోరుతూ, అశ్వత్థామన్ సహా 12 మంది చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్లు వేశారు. సోమవారం ఆ పిటిషన్లు విచారణకు రాగా అశ్వత్థామన్, రౌడీ అంజలై సహా 12 మంది, జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో ప్రతిరోజు హాజరై సంతకం చేయాలని నిబంధనలతో న్యాయమూర్తి ఎస్.కార్తికేయన్ వారికి బెయిలు మంజూరు చేశారు. అదే సమయంలో, నిందితులు గోకుల్, హరిధరన్ తదితరులకు బెయిలు ఇచ్చేందుకు న్యాయమూర్తి నిరాకరించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పెరంబూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు వెళ్లిన విద్యార్థి, విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. విల్లుపురం జిల్లా పలవన్‌తాంగళ్ గ్రామానికి చెందిన లోక్‌ప్రదీప్ (15) సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్నేహితులతో కలసి సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువు తీరంలో ఉన్న టాయిలెట్ పైకి ఎక్కిన ప్రదీప్, చేపలు పడుతున్న సమయంలో, టాయిలెట్ భవనం మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలకు తగిలిన ప్రదీప్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


ఇడియాప్పం కాదు ఇడ్లీ!

● సర్‌పై తమిళిసై కామెంట్



చెన్నై, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఓటర్లకు సమస్య కలిగించే 'ఇడియాప్పం' కాదని, సులువుగా జీర్ణమయ్యే 'ఇడ్లీ' వంటిదని బీజేపీ మహిళా నాయకురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ కామెంట్ చేశారు. కేకే నగర్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ సర్ పనులు ఇడియాప్పంలా చిక్కులతో ముడులతో కూడుకున్నవని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శిడం గర్హనీయమన్నారు. వంటికి పోషకాలనందించే ఇడ్లీ ఎలాంటిదో ప్రజాస్వామ్యానికి బలాన్నిచ్చేది 'సర్' మాత్రమేనని ఆమె కామెంట్ చేశారు.

తీర్థకొలనుకు జలకళ



సుబ్రమణ్యస్వామి ఆలయ తీర్థకొలను

తిరుత్తణి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) తిరువళ్లూర్ జిల్లావ్యాప్తంగా కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని నదులు, చెరువులు, కొలనులు జలకళను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో, తిరుత్తణి సుబ్రమణ్యస్వామి శరవణపొయిగై తీర్థకొలనులో కూడా నీరు చేరింది. ఇటీవల 24 లక్షలతో కొలనులో పూడిక తీయించారు. క్రమంలో, కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు శరవణపొయిగై తీర్థకొలను జలకళను సంతరించుకుంది. నిండుకుండలా ఉన్న తీర్థకొలనును చూసి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధులను సత్కరించడం సంతోషకరం

● ఎమ్మెల్యే చంద్రన్



వృద్ధ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 70 యేళ్ల దాటిన వృద్ధులను సత్కరించనున్నట్లు అసెంబ్లీలో ఇటీవల దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా తిరుత్తణి మురుగన్ ఆలయం ప్రాంగణంలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే చంద్రన్ పది మంది వృద్ధ దంపతులను ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ అముదా, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సురేష్‌బాబు, నాగన్, కౌన్సిలర్లు గణేశన్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిల్వలను వెంటనే తొలగించాలి

● దుకాణానికి అధికారుల నోటీసులు

తిరుత్తణి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కైవందూరు గ్రామంలోని ఓ దుకాణంలో భారీగా నిల్వవుంచిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వెంటనే తొలగించాలని ఆరోగ్యశాఖ అధికారులు నోటీసులిచ్చారు. ఈ ప్రాంతంలో గత కొన్ని నెలలుగా ప్లాస్టిక్ వస్తువులను నిల్వవుంచి వాటిని బిహార్ రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నారని, ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల దోమల బెడద విపరీతంగా పెరిగి ప్రజలు డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారినపడుతున్నారని, జిల్లా కలెక్టర్‌కు ప్రజలు ఫర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పూండి బీడీవో, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించడంతో వెంటనే అధికారులు ఆ దుకాణంలో తనిఖీ చేసి వెంటనే ప్లాస్టిక్ నిల్వలను తొలగించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణం యాజమాన్యానికి అధికారులు నోటీసులు జారీ చేశారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి మూడేళ్ల జైలు

ప్యారీస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లో 9యేళ్ల చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పుచెప్పింది. 2023వ సంవత్సరం ఎగ్మూర్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్న చిన్నారిని ఓ యువకుడు లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆమె తల్లి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 24యేళ్ల యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచి అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తైన నేపథ్యంలో, న్యాయస్థానం మంగళవారం ఆ యువకుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.